క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న సీపీ త్రివిక్రమ్ వర్మ



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సీపీ త్రివిక్రమ్ వర్మ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అంతరాలయంలో స్వామికి అష్టోత్తరం పూజ నిర్వహించారు. గోదాదేవి సన్నిధిలో హారతి ఇచ్చారు. స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

అవ్వాతాతలకు 'వైఎస్సార్ కంటి వెలుగు'



కంటి వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు ప్రసాద్ గార్డెన్స్‌లోని అప్‌గ్రేడ్ పీహెచ్‌సీలో సోమవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు మాట్లాడుతూ 60 ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరి కంటి చూపు మెరుగుపడాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. అవ్వాతాతల కళ్లలో వెలుగులు నింపేందుకు ఉచిత వైద్య పరీక్షలతోపాటు కళ్లద్దాలు అందిస్తున్నట్లు చెప్పారు. నేత్ర వైద్య పరీక్షలు చేయించుకున్న వారందరికీ కార్పొరేటర్ కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కంటిపిల్లి వరలక్ష్మి, మహంతి గౌరిశంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆటోనగర్‌లో పనులు ప్రారంభించాలి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతున్న రాజన్న ఆటోనగర్ కాలనీవాసులు

మహారాణిపేట: రాజన్న ఆటోనగర్‌లో నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ స్క్రాప్ వర్కర్లు ఆందోళన చేపట్టారు. జిల్లా స్క్రాప్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. 2019లో స్క్రాప్ వర్కర్స్‌కు ఆనందపురం మండలం కనుమం గ్రామంలో 151.7 ఎకరాలను కేటాయించారని, ఇప్పటి వరకు కార్మికులకు ఈ స్థలం ఇవ్వలేదని సీఐటీయూ నాయకుడు కె.గణేష్ తెలిపారు. ఈ సమస్యను కొంత మంది కార్మికులు తప్పుదారి పట్టిస్తున్నారని, వారి మాటలు నమ్మవద్దని సీఐటీయూ నాయకుడు వై.రాజు అన్నారు. ఈ స్థలంలో తక్షణం పనులు ప్రారంభించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు నాయకులు వినతిపత్రం సమర్పించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

సేవల్లో ఆదర్శం.. వలంటీర్ వ్యవస్థ

జగదాంబ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వలంటీర్ల వ్యవస్థ సేవల్లో ఆదర్శంగా నిలుస్తోంది. పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించే పనిని వలంటీర్లు చిత్తశుద్ధితో నిర్వహిస్తున్నారు. ఇళ్లు, వైద్యం, పెన్షన్లు, రేషన్ కార్డులు వంటి సౌకర్యాలు సులువుగా పొందేలా తమ వంతు బాధ్యతను సక్రమంగా నెరవేరుస్తూ లబ్ధిదారుల మన్ననలు అందుకుంటున్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వలంటీర్లు వారధులుగా ఉంటూ సంక్షేమ పథకాల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారు. పారదర్శకంగా ప్రభుత్వ పథకాలను, సేవలను ప్రజలకు చేరవేస్తూ సేవా దృక్పథాన్ని చాటుతున్నారు. గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు వైఎస్ జగన్ ప్రభుత్వం చేస్తున్న నిరంతర కృషిలో వీరు కీలకంగా వ్యవహరిస్తున్నారు.

ఆస్పత్రి బెడ్‌పై ఉంటే పింఛన్ ఇచ్చారు



నా ఆరోగ్యం బాగాలేదు. కేజీహెచ్‌లో చికిత్స తీసుకుంటున్నాను. నడవలేని స్థితిలో ఉన్న నాకు వలంటీర్ ఆస్పత్రికే వచ్చి పింఛన్ అందించారు. గతంలో పింఛన్ల కోసం పడిగాపులు పడి ఉండేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. మాలాంటి వారికి ఎంతో సాయం చేస్తున్నారు.

– వెంకటరావు, ఫెర్రీ వీధి, జీవీఎంసీ 39వ వార్డు

నడవలేని స్థితిలో ఉన్న వారికి...



నడవలేని స్థితిలో ఉన్నవారికి జగన్‌బాబు ఆపద్బాంధవుడు అయ్యారు. ఆ బాబు నియమించిన వలంటీర్లు ఎంతో సేవ చేస్తున్నారు. గతంలో ఆరోగ్యం బాగాలేక రేషన్‌కు వెళ్లకపోతే రేషన్ వెనక్కి వెళ్లిపోయేది. ఇప్పుడు ప్రతీ నెల రేషన్ వాహనాలు మా ప్రాంతానికే వస్తున్నాయి. వలంటీర్ వాహనం ఎప్పుడు వస్తుందో సమాచారం అందిస్తున్నారు. మేము వెళ్లలేని పరిస్థితి ఉంటే, వాళ్లే ఇంటికి తీసుకువస్తున్నారు.

– రాజయ్య కోటవీధి జీవీఎంసీ 39వ వార్డు

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు కంటిపల్లి వరలక్ష్మి

జగదాంబ: రాజకీయ మనుగడ కోసం టీడీపీ నాయకురాలు వంగలపూడి అనిత వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని వైఎస్సార్‌సీపీ వార్డు నాయకురాలు కంటిపల్లి వరలక్ష్మి అన్నారు. 39వ వార్డు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అనితవన్నీ కేవలం రాజకీయ ఉనికి కోసం ప్రతిపక్ష నేత చంద్రబాబు మాట్లాడిస్తున్న మాటలన్నారు. ఇంత దిగజారుడుతనం సరికాదని హితవు పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పార్టీలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వార్డు వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం నీవివేకానికే వదిలేస్తున్నామన్నారు. కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, దుర్గాలమ్మ ఆలయ చైర్మన్ నాయిని మల్లిబాబు, ధర్మకర్తలు బత్తిన మంగరాజు, మహంతి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యంతో జీవించాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న రాజశేఖర్

దాబాగార్డెన్స్: ప్రజలందరూ ఐకమత్యంతో జీవించాలని ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్ ఆకాంక్షించారు. ఎంవీపీ కాలనీ తీర్థ ప్రాంగణంలో సేవక్ వ్యవస్థాపకుడు వినయానంద గురూజీ ఆదేశాల మేరకు విశ్వ కుటుంబం అనే అంశంపై సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. సోమవారం పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలకు నిలయమైన భారతదేశం విశ్వకుటుంబంగా నిలిచిందన్నారు. ఎవరు.. ఎక్కడ ఉన్నా అందరూ ఐకమత్యంగా జీవించాలని కోరారు. ప్రతి విద్యార్థి విశ్వ కుటుంబానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ టి.ఆర్.ధనలత, ఎ.శ్రీనివాసరావు, పీబీపీ రాజు, డి.జవహర్‌రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుక్కల నియంత్రణపై ప్రత్యేక దృష్టి



బాలుడిని పరామర్శించి యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేయిస్తున్న సిటీ వెటర్నరీ డాక్టర్



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో వీధి కుక్కల బెడదపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ ఆదేశాల మేరకు వెటర్నరీ విభాగం అధికారి డాక్టర్ కిషోర్ నేతృత్వంలో సిబ్బంది రంగంలోకి దిగారు. 95వ వార్డు పొర్లుపాలెంలో కుక్క దాడిలో గాయపడిన చీపురుపల్లి రుత్విక్ అనే బాలుడిని పరామర్శించారు. యాంటీ ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ఆ వార్డులో సుమారు 25 వీధి కుక్కలను పట్టుకొని ఆపరేషన్ కోసం పంపించినట్టు వెటర్నరీ డాక్టర్ కిషోర్ తెలిపారు. మేయర్ ఆదేశాల మేరకు ప్రతిరోజూ సుమారు 100 వీధి కుక్కలకు ఇసుకతోట, గోపాలపట్నం, గాంధీగ్రామం, నరవ, చినగదిలి, జడ్జికోర్టు సమీపాన గల వెటర్నరీ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయనున్నట్టు పేర్కొన్నారు.

బెర్తు చార్జీల్లో 50 శాతం మాఫీ చేయాలి

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ మెకనైజ్డ్ బోట్లకు 50 శాతం బెర్తు చార్జీలు మాఫీ చేస్తే బాకీలు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని ఏపీ మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు. బెర్తుల చార్జీలు పెంచడం పోర్టుకు తగదన్నారు. కరోనా కాలంలో అన్ని రంగాలకు కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పించినా.. మత్స్య పరిశ్రమకు ఎటువంటి రాయితీలు ఇవ్వలేదని చెప్పారు. అందువల్ల వల్ల పెంచిన బెర్తు చార్జీలను కాకుండా పాత చార్జీలను కొనసాగించాలని కోరారు. పదేళ్ల కిందట బోట్లను బయటకు మరమ్మతుల నిమిత్తం తీసుకొచ్చామన్నారు. వాటికి ల్యాండింగ్ చార్జీలను పూర్తిగా రద్దు చేయాలని కలెక్టర్‌ను కోరామని చెప్పారు. ఈ మేరకు జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వినతిపత్రం కూడా సమర్పించామన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు

మహారాణిపేట: ఆదానీ గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కారించాలని అఖిలపక్ష నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. అతి తక్కువ వేతనాలు ఇస్తున్న తమను ఆదుకోవాలని 14 రోజులుగా ఆందోళన చేస్తున్నామని సంఘాల నాయకులు పేర్కొన్నారు. గంగవరం పోర్టు నిర్మాణం కోసం గంగవరం, దిబ్బపాలెం మత్స్యకార గ్రామాల్లోని ఇళ్లు, భూములను ఇచ్చామని, ఏళ్లు గడుస్తున్న వేతనాలు పెంచలేదని నాయకులు వాపోయారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, హెచ్ఎంఎస్ జిల్లా అధ్యక్షుడు డి.అప్పారావు, టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా అప్పారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మల్లన్న, గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ వర్కింగ్ అధ్యక్షుడు బి.జగన్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధుల నిర్వహణ



మాట్లాడుతున్న ఏఈఎంఎస్ ఆపరేషన్ హెడ్ డాక్టర్ సునీల్, చిత్రంలో జోనల్ మేనేజర్ గణేష్, ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్

మహారాణిపేట: సిబ్బంది అంకిత భావంతో పనిచేయాలని అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీస్(ఏఈఎంఎస్) ఆపరేషన్ హెడ్ డాక్టర్ సునీల్ కోరారు. సోమవారం రేసపువానిపాలెంలో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో జరిగిన 108 అధికారుల జోనల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థను మరింత అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అంబులెన్స్ నిర్వహణలో పలు మెళకువలు నేర్పారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ గణేష్, జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్, జిల్లా మేనేజర్ త్రినాథ్, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సురేష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాపాహోమ్‌కు బాలుడి అప్పగింత



తేజకిరణ్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ సాయి, ఏఎస్ఐ సతీష్

మద్రిపాలెం: పాపా హోమ్ నుంచి తప్పించుకున్న ఓ బాలుడిని కంచరపాలెం పోలీస్‌లు తిరిగి అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లి జిల్లా తోటకూర గ్రామానికి చెందిన చీపురుపల్లి తేజకిరణ్(9)ను తండ్రి ఈశ్వరరావు మూడు నెలల కిందట నగరంలోని పోలీస్ బ్యారెక్స్ వద్ద గల పాపా హోమ్‌లో చేర్పించారు. అయితే హోమ్ నుంచి తప్పించుకున్న ఆ బాలుడు కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్లపై ఆదివారం సంచరించడాన్ని పోలీసులు గమనించారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ ఎస్.సాయి, ఏఎస్ఐ సతీష్ ఆ బాలుడి వివరాలు తెలుసుకుని మళ్లీ పాపాహోమ్‌కు అప్పగించారు.

ప్రజలకు ఆహ్లాదకర వాతావరణమే లక్ష్యం



చిన్నారుల క్రీడా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులో తీరాన్ని ఆనుకుని ఉన్న లాసన్స్‌బే కాలనీ పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. వేస్ట్ టు వండర్స్ పేరిట పార్కులో ఆధునికీకరించిన పలు క్రీడా ప్రాంగణాలను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే క్రమంలో పార్కులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆలోచనల్లో భాగంగా వేస్ట్ టు వండర్స్ కాన్సెప్ట్‌తో ఈ పార్కులో క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేశామన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా సేకరించిన వ్యర్థాలను, టైర్లను వినియోగించి అన్ని వయసుల వారికి ఆహ్లాదం పంచే విధంగా పార్కును తీర్చిదిద్దామన్నారు. ప్రారంభం అనంతరం ఆయా క్రీడా, ఆహ్లాదకరమైన సముదాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసిరావు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, కార్పొరేటర్ నూకరత్నం, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ సూరాడ వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

30న సంగీత కళాకారుల సంఘ ఎన్నికలు

మద్దిలపాలెం: విశాఖ సంగీత కళాకారుల సంఘం ఎన్నికలు ఈ నెల 30న నిర్వహించనున్నామని సంఘం కన్వీనర్ చెన్నా తిరుమలరావు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరించనున్నామన్నారు. ఎన్నికల్లో అన్ని అంశాలలో సేవలందిస్తున్న కళాకారులకు ప్రాధాన్యత ఇవ్వనున్నామన్నారు. సంఘంలో సభ్యత్వ నమోదు ప్రక్రియను ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81796 05267 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

ఆపద వేళ ఆదుకుంటూ..

- ఆపన్నులకు ఎమ్మెల్యే వాసుపల్లి చేయూత



మంచం పట్టిన యువకుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: నియోజకవర్గవాసులకు ఆపద వేళ తానున్నానంటూ భరోసా ఇస్తున్నారు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్. తన సొంత నిధుల నుంచి ఎంతో మందికి సాయం అందిస్తూ ఆదుకుంటున్నారు. అందులో భాగంగా 34వ వార్డులో ఆరుగురికి సోమవారం ఆర్థిక సాయం అందించారు. కొబ్బరితోటకు చెందిన మామిడి వెంకటస్వామికి వెన్నుపూస శస్త్ర చికిత్స చేయడంతో, వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు అందజేశారు. ఫైల్స్‌తో బాధపడుతున్న బండి అప్పలరాజు మందుల ఖర్చులకు రూ.5వేలు ఇచ్చారు. ఇల్లు కూలిపోయి, ఇబ్బంది పడుతున్న సురపతి సత్యవతికి రూ.2,500, పక్షవాతంతో బాధపడుతున్న గండి ఆంథోనీకి రూ.2,500, కంటి ఆపరేషన్, వైద్య ఖర్చుల కోసం షేక్ మదీనాకు రూ.2,500, అనారోగ్యంతో మంచానపట్టిన పెయింటర్ గుడివాడ అరుణ్‌కుమార్‌కు రూ.2,500 ఆర్థిక సాయం చేశారు. ఇద్దరు దివ్యాంగులకు పెన్షన్ మంజూరుకు సదరం సర్టిఫికెట్ అవసరం కావడంతో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్‌ను కలిశారు. పరిశీలించి, సర్టిఫికెట్ అందించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోట పద్మావతి, పార్టీ నాయకులు లింగం శ్రీను, లండా రమణ, ఆదివిష్ణు, కోసూరు వాసు, బొడ్డేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కట్టడికి జీవీఎంసీ కృషి



బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి



సైకిల్‌పై కార్యాలయానికి వెళ్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణలో భాగంగా సోమవారం నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి తన క్యాంపు కార్యాలయం నుంచి ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించి ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై చేరుకుని, జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్‌లు మాట్లాడుతూ కాలుష్య నియంత్రణలో భాగంగా సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు. కాలుష్యం కట్టడికి జీవీఎంసీ విశేషంగా కృషి చేస్తోందన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి



ర్యాలీలో ఎంజీఎం హైస్కూల్ విద్యార్థులు, టూటౌన్ ఎస్ఐ శ్రీనివాస్, మహిళా పోలీసులు

అల్లిపురం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని టూ టౌన్ పోలీసులు సూచించారు. డాబాగార్డెన్స్ మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం సచివాలయం మహిళా పోలీసు ఎండీ నూర్జహాన్ బేగం, జీవీవీ హారిక, రమాదేవి, శ్రావ్య, అమృతదీప్తి ఆధ్వర్యంలో టూటౌన్ ఎస్ఐ శ్రీనివాస్, మహిళా ఏఎస్ఐ కె.కాంతం విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్ వినియోగించే వారి జీవితాన్ని మాత్రమే కాకుండా వారి కుటుంబంలో ప్రతి ఒక్కరిని ప్రభావితం చేస్తాయన్నారు. చిన్నారులు తమ కుటుంబంలో పెద్ద వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి బ్యానర్లు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. డ్రగ్స్‌కు దూరంగా ఉందాం అంటూ విద్యార్థులు నినదించారు. కార్యక్రమంలో టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, ఎంజీఎం హైస్కూల్ హెచ్ఎం ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి ప్లాస్టిక్ వ్యాపారుల సమస్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

జగదాంబ: ప్లాస్టిక్ అమ్మకాలపై ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారం వ్యాపారాలు చేసుకునే అవకాశమివ్వాలని 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు కోరారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. పూర్ణామార్కెట్‌లో ప్లాస్టిక్ వ్యాపారుల సంఘం అందరూ ప్రభుత్వ జీవో ప్రకారం వ్యాపారాలు చేస్తున్నా.. కమిషనర్ ఆదేశాల పేరుతో అపరాధ రుసుం విధిస్తూ తమ పొట్టకొడుతున్నారంటూ కార్పొరేటర్ వద్ద వ్యాపారులంతా ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కార్పొరేటర్ భాస్కరరావు వ్యాపారులతో కలిసి జీవీఎంసీ కమిషనర్‌కు సమస్యను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్లాస్టిక్ విక్రయిస్తున్న వ్యాపారులపై విజిలెన్స్ పేరుతో దాడులు చేసి అపరాధ రుసుములు విధిస్తున్నారన్నారు. దీని వల్ల వ్యాపారులు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన కమిషనర్ సాయికాంత్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో దీనికి వ్యతిరేకం కాదన్నారు. నిబంధనల ప్రకారం 120 మైక్రాన్ క్యారీబ్యాగ్‌లు, 75 మైక్రాన్ ప్యాకింగ్ కవర్ల అమ్మకాలపై కూడా పరిశీలిస్తామన్నారు.

పాఠ్య పుస్తకాల సరఫరా పరిశీలన



పాఠ్య పుస్తకాల వివరాలు తెలుసుకుంటున్న డీఎస్‌వో సూర్యప్రకాశరావు

మహారాణిపేట: సివిల్ సప్లయిస్‌కు చెందిన మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్(ఎండీయూ) వాహనం ద్వారా పాఠ్య పుస్తకాలు స్కూళ్లకు సరఫరా అవుతున్న తీరును సోమవారం డీఎస్‌వో సూర్యప్రకాశరావు పరిశీలించారు. పాత పోస్టాఫీసు వద్ద ఉన్న క్వీన్‌మేరీ హైస్కూల్‌లో పాఠ్య పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి మహారాణిపేట, సీతమ్మధార, గాజువాక, ములగాడ మండలాలకు పాఠ పుస్తకాలను సరఫరా చేసే బాధ్యతను ఎండీయూ వాహనాలకు అప్పగించారు. ఈ నాలుగు మండలాల్లోని పాఠశాలలకు ఇక్కడ నుంచి పాఠ్య పుస్తకాలు రవాణా చేస్తున్నారు. ఈ స్టాక్ పాయింట్‌ను డీఎస్‌వో సందర్శించి పుస్తకాల రవాణా, స్కూళ్లకు సరఫరా, ఇతర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

లలితా పీఠంలో ప్రత్యంగిరా హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో అమావాస్య సందర్భంగా సోమవారం శ్రీ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహించారు. పీఠం విస్తరణాధికారి మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ భక్తుల కోరిక మేరకు లలితా పీఠంలో ప్రతి అమావాస్య రోజూ ప్రత్యంగిరా భద్రకాళి హోమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆదిపరాశక్తి ప్రత్యంగిరాదేవి అనుగ్రహం పొందేందుకు ఈ హోమం చేసినట్టు చెప్పారు.

పోలమాంబ ఆలయంలో శ్రావణ మాస పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ఏయూ క్యాంపస్: పెద వాల్తేరులోని శ్రీపోలమాంబ అమ్మవారి దేవస్థానంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి వచ్చేనెల 15వ తేదీ వరకు ఆలయంలో ఈ పూజలు చేయనున్నారు. సెప్టెంబర్ 18, 25, సెప్టెంబర్ 1, 8, 15 తేదీలలో కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. వచ్చేనెల 31న గురువారం శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన చేయనున్నారు. అమ్మవారికి నెల పూజకు రూ.350 చెల్లించి భక్తులు తమ గోత్ర నామాలతో నెల రోజుల పాటు పూజలు జరిపించుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఆఖరు రోజున అమ్మవారి ప్రసాదం అందిస్తారు. ఆలయంలో ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజుల్లో నిర్వహించే చండీ హోమంలో భక్తులు రూ.1,500 చెల్లించి స్వయంగా పాల్గొనవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు.